రేపటి నుంచి 'బడి బాట'

మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచేందుకు ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. 'బడి బాట'పై మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఐదేండ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు.

ఎంపీపీకి సన్మానం

మాట్లాడుతున్న ఎంపీపీ బానోత్ మౌనిక

టేకులపల్లి, జూన్ 1: టేకులపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బానోత్ మౌనిక అధ్యక్షతన జరిగింది. ఎంపీపీగా మౌనిక ఎన్నిక తర్వాత ఇది తొలి సమావేశం. దీంతో ఆమెను సభ్యులు సన్మానించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చెప్పారు. ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి సమావేశం ఉంటుందని ఎంపీడీవో రవీందర్‌రావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీటీ ముత్తయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జూన్ 1: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శనిఆరం స్వర్ణ తులసి పూజలు చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిల భారత రైతు సంఘం నాయకులు

జూలూరుపాడు, జూన్ 1 : నకిలీ విత్తనాలు, కల్తీ పురుగుమందులను అరికట్టాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కే ఉమర్ మాట్లాడుతూ ఏజెన్సీప్రాంతంలో రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుమందులను అంటగడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసాలకు పాల్పడే వారిపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు ఉల్లాది రమేశ్, కూరాకుల నర్సింహారావు, కల్తి రామయ్య, కల్తి నర్సింహారావు, జాటోత్ నర్సింహారావు పాల్గొన్నారు.

వారాంతపు సంతలో తనిఖీలు

తూనిక బాట్లను పరిశీలిస్తున్న మనోహర్

టేకులపల్లి, జూన్ 1: స్థానిక వారాంతపు సంతలోని కూరగాయలు, మాంసం, పండ్ల దుకాణాలను జిల్లా తూనికలు-కొలతల శాఖ అధికారి కె.మనోహర్ శనివారం తనిఖీ చేశారు. తూకాల్లో తేడా చేసి, కొనుగోలుదారులను మోసగిస్తే చర్యలు ఉంటాయని విక్రేతలను హెచ్చరించారు. తూకాన్ని, తూకపు రాళ్లను నిశితంగా పరిశీలించాలని వినియోగదారులతో చెప్పారు. తేడా ఉన్నట్లయితే విక్రేతలను ప్రశ్నించాలని సూచించారు. తూకపు బాట్లను పరిశీలించి ముద్రలు వేయించారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు ఏర్పాటు

టేకులపల్లి, జూన్ 1: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మండలంలోని నాలుగు సబ్ స్టేషన్లలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు టేకులపల్లి, బొమ్మనపల్లి విద్యుత్ ఏఈలు హెచ్.దేవనాయక్, పి.బుజ్జి కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టేకులపల్లి-94408 11562, బోడు-94947 20057, బొమ్మనపల్లి-94924 62316, కోయగూడెం-95422 64867కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కాల్ సెంటర్లు నిరంతరాయంగా పనిచేస్తాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అటవీ గ్రామంలో సోలార్ వెలుగులు

అశ్వారావుపేట రూరల్, జూన్ 1: మండలంలోని బచ్చువారిగూడెం పంచాయతీ పరిధిలోగల దట్టమైన అటవీ ప్రాంతంలోని గొత్తికోయల గ్రామం రేగళ్లలో శనివారం సోలార్ లైట్లను 'సమరిటన్స్ ఫర్ ది నేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంస్థకు ఎస్ ఫౌండేషన్ సహకరించింది.

దమ్మపేట: పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పర్ణశాల: పూజల్లో పాల్గొన్న భక్తులు, పాల్వంచ: కేటీపీఎస్ సీ కాలనీ వద్ద పూజలు

అశ్వారావుపేట టౌన్: చిన్నారుల సందడి

ఘనంగా హనుమాన్ జయంతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయాన్నే స్వామి వారికి పంచామృత ఫలరసాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, నాగవల్లి దళార్చన, స్వామివారి హోమం, సుందరకాండ సర్గహోమం, మహాపూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగ పూజలు నిర్వహించారు. పలుచోట్ల శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- నమస్తే నెట్‌వర్క్

జూలూరుపాడు : పాపకొల్లులో శోభాయాత్ర

అన్నపురెడ్డిపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

ఆళ్లపల్లి: అన్నదానం చేస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: భక్తుల పూజలు

మణుగూరు టౌన్: మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ బాధ్యులు, చండ్రుగొండ: హనుమాన్ చాలీసాలో భక్తులు, కొత్తగూడెం అర్బన్ : రైటర్‌బస్తీలో భక్తుల పూజలు

ఎండ తీవ్రం.. జాగ్రత్తలు అవసరం

భద్రాచలం, జూన్ 1: ఎండ తీవ్రంగా ఉన్నందున ప్రజలు, ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో కోరారు. పిల్లలు, వృద్ధులు తప్పనిసరి అయితేనే బయటకు రావాలని, అపపుడు కూడా గొడుగు/టోపీ ధరించాలని, దాహం వేయకపోయినా తరచూ నీళ్లు తాగాలని సూచించారు. అనారోగ్యంగా అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని, ప్రతి రోజూ ఓఆర్ఎస్, నిమ్మకాయ నీరు, చల్లటి మజ్జిగ వంటి పానీయాలను ఇంట్లోనే తయారు చేసుకుని తాగాలని కోరారు. లేత రంగుల్లో ఉండే, వదులైన కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు గురైతే వెంటనే ఏఎన్ఎం, ఆశా వర్కర్లను సంప్రదించి దగ్గర్లోన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి ప్రథమ చికిత్సలు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

బాలిక అదృశ్యం

అశ్వారావుపేట, జూన్ 1: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె తల్లిదండ్రులు శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై శ్రీరాముల శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ధన్‌రాజు మృతదేహం

రామవరం, జూన్ 1 : నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో కోరి ధన్‌రాజు(55) మృతి చెందిన ఘటన శనివారం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... రామవరం నెహ్రూ బస్తీకి చెందిన ధన్‌రాజు త్రీ ఇంక్లైన్‌కు బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 9 గంటలకు త్రీ ఇంక్లైన్ నుంచి రామవరం వైపు నడుచుకుంటూ వస్తున్న ధన్‌రాజ్‌ను అదేమార్గంలో రుద్రంపూర్‌కు చెందిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో ధన్‌రాజు తలకు బలమైన గాయమైంది. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు.

పథకాల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

సీపీఐ నాయకుడు బాగం

మాట్లాడుతున్న బాగం హేమంతరావు

అశ్వారావుపేట టౌన్, జూన్ 1: పథకాల అమలులో ఏవేని సమస్యలు, వైఫల్యాలు ఏర్పడితే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఆయన శనివారం తమ పార్టీ స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ఇండియా కూటమి గెలుస్తుందని జోస్యం చెప్పారు. మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక జిమ్మిక్కులు చేశారని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్ల ధనాన్ని వెలికితీస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను ప్రస్తావించకుండా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేశారని విమర్శించారు. ఇవేవీ ఫలించలేదని, ఇండియా కూటమినే అధికారం చేపడుతుందని అన్నారు. నాయకులు సయ్యద్ సలీమ్, గన్నిన రామకృష్ణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి

మాట్లాడుతున్న ఏరియా జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు రూరల్, జూన్ 1: మే నెలలో బొగ్గు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యం 3.22 లక్షల టన్నులకుగాను 3.46 లక్షల టన్నులు (107 శాతం) సాధించినట్లు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. జీఎం కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. 0.08 లక్షల టన్నులను రైల్వే మార్గం ద్వారా, 0.93 లక్షల టన్నులను రోడ్డు మార్గం ద్వారా, ఆ2.38 లక్షల టన్నులను ర్‌సీహెచ్‌పీ ద్వారా రవాణా చేసినట్లు వివరించారు. ఏప్రిల్‌లో రెండు రేకుల ద్వారా రవాణా చేశామన్నారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 41.30 లక్షల టన్నులకుగాను 6.75 లక్షల టన్నులు (105 శాతం) సాధించినట్లు ప్రకటించారు. రక్షణతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులను అభినందించారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులకు అభినందన

ఉత్తమ ఉద్యోగులు వెంకటేశ్వర్లు సదాత్ హుస్సేన్

ఇల్లెందు రూరల్, జూన్ 1: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఇల్లెందు ఏరియా ఉత్తమ ఉద్యోగుల పేర్లను అధికారులు ప్రకటించారు. ఎంపికైన ఆరెం వెంకటేశ్వర్లును, మహ్మద్ సదాత్ హుస్సేన్‌ను జీఎం జాన్ ఆనంద్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

పాల్వంచ, జూన్ 1 : ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగింది. దీంతో శుక్రవారం పాత పాల్వంచలోని ఇందిరాకాలనీ సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ అయి పవర్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దానికి పరిష్కారంగా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం కొత్త 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇందిరాకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఇందిరాకాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, హమాలీకాలనీ, వెంకటేశ్వర హిల్స్‌కాలనీ, బీసీఎం రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కరెంట్ సరఫరా చేసి ట్రాన్స్‌ఫార్మర్ బిగించి మరలా విద్యుత్ సరఫరాను చేసినట్లు ఏడీ లక్ష్మణ్ తెలిపారు. విద్యుత్ వాడకం పెరిగినా ఇక ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు.

పోలీస్ అధికారికి సన్మానం

హైదరాబాద్‌కు వెళ్తున్న ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ కుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 1: లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా మూడునెలలు విధులు నిర్వహించిన ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ కుమార్‌సింగ్‌ను శనివారం సన్మానించారు. ట్రైనింగ్ పిరియడ్ పూర్తి కావడంతో హైదరాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా ట్రైనీ ఐపీఎస్‌ను పోలీసు అధికారులు శాలువా కప్పి సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. జ్ఞాపికలను అందజేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఎస్సై రమణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య పెంచాలి

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

చండ్రుగొండ, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని మండల విద్యశాఖాధికారి సత్యనారాయణ అన్నారు. బడి బాట కార్యక్రమంపై ఆయన శనివారం ప్రధానోపాధ్యాయులు, అధికారులు తదితరులతో సమావేశమయ్యారు. ఈ నెల 3 నుంచి 19 తేదీ వరకు బడి బాట కార్యక్రం ఉంటుందన్నారు. ఎంపీడీవో అశోక్, సీడీపీవో నిర్మలాజ్యోతి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ఇల్లెందు రూరల్: తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి బాబురావు

ఇల్లెందు రూరల్, జూన్ 1: ఇల్లెందులోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబురావు, ఏవోలు సతీష్, సాయి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి మండలంలో..

టేకులపల్లి: తనిఖీ చేస్తున్న ఎస్సై రాజ్‌కుమార్, ఏవో అన్నపూర్ణ

టేకులపల్లి, జూన్ 1: మండలంలోని కోయగూడెం, ముత్యాలంపాడు తదితర గ్రామాల్లోగల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, కొత్తగూడెం సీడ్ టాస్క్ ఫోర్స్ ఎస్సై రాజ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా అంజిపాక జట్టు

బహుమతి అందుకుంటున్న జట్టు

పర్ణశాల, జూన్ 1: దుమ్ముగూడెం మండలం అంజిపాక గ్రామంలో నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. అంజిపాక జట్టు విజేతగా నిలిచింది. కొత్తూరు, మంగవాయిబాడవ, బైరాగులపాడు జట్లుగా వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. బహుమతులను జడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ తదితరులు ప్రదానం చేశారు.

30 కిలోల గంజాయి పట్టివేత

గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పాల్వంచ, జూన్ 1 : ఒరిస్సా నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పాల్వంచలో పోలీసులు శనివారం పట్టుకున్నారు. దానివిలువ సుమారు రూ.7.50 లక్షలు ఉంటుంది. పోలీసుల కథనం ప్రకారం... పాల్వంచ పట్టణ ఎస్సైలు బాణాల రాము, స్వప్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కేటీపీఎస్ సీ కాలనీ గేటు వద్ద జాతీయ రహదారిపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ప్రశ్నించగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మూడ్ వెంకట్రావ్, కార్తీక్‌గా తెలిపారు. వారి రెండు బ్యాగుల్లో తనిఖీ చేయగా 30 కిలోల గంజాయిని విజయవాడకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఒరిస్సా నుంచి వివిధ వాహనాల్లో ప్రయాణిస్తూ పాల్వంచకు చేరుకున్నారు. పాల్వంచ నుంచి విజయవాడకు వెళ్లేందుకు వాహనం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో పోలీసులకు చిక్కారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

అశ్వారావుపేట రూరల్, జూన్ 1: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దాసరి రాంబాబు(62), గణేష్, అజయ్, తమ కుటుంబాలతో కలిసి ఏపీలోని ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆటోలో తిరిగొస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలోని రమమణక్కపేట దగ్గర ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక భాగంలో వీరి ఆటో ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న వారిలో దాసరి రాంబాబుకు, గణేష్‌కు, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రాంబాబు మృతి చెందాడు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. మరో 40 నిమిషాల్లో ఇంటికి చేరుకునేవాళ్లమని, ఇంతలోనే ఇలా జరిగిందని, తమను ఆ దేవుడు కూడా కాపాడలేదని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

భద్రాచలం, జూన్ 1: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. అతని వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చని పేర్కొన్నారు. గడ్డం, జుట్టు మొత్తం నెరిసిందని తెలిపారు. బ్లూ కలర్ గడుల లుంగీ, లేత గులాబీ రంగు చొక్కా ధరించాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 82106 నంబర్‌లోగానీ, పట్టణ పోలీస్ స్టేషన్‌లోగానీ సంప్రదించవచ్చని సూచించారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్, జూన్ 1: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో పాల్వంచరూరల్ పోలీసులు శనివారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 29వ తేదీన జగన్నాథపురంలోని ఫంక్షన్‌హాల్లో జరిగిన శుభకార్యానికి కొత్తగూడేనికి చెందిన పున్నం సింగ్ హాజరయ్యాడు. ఇదే కార్యక్రమానికి ఇల్లెందు నుంచి అనిల్ కోరి, నత్తూ అనే ఇద్దరు సోదరులు కూడా హాజరయ్యారు. వీరు మద్యం సేవించి ఫంక్షన్‌హాల్‌లో ఉన్నవారిని భయభ్రాంతులకు గురిచేస్తుండగా పున్నంసింగ్ వారించాడు. మద్యం మత్తులో ఉన్న వారిద్దరూ సింగ్‌తో ఘర్షణపడి గాయపర్చారు. సింగ్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

అశ్వారావుపేట, జూన్ 1: కోడి పందేల జూదరులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మండలంలోని గుమ్మడవల్లి గ్రామ సమీపంలోని కోడి పందేల స్థావరంపై ఎస్సై శ్రీరాముల శ్రీను శనివారం దాడి చేశారు. పదిమంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.11వేలు, నాలుగు పందెం కోళ్లు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దు దాడిలో వ్యక్తి మృతి

పర్ణశాల, జూన్ 1: ఎద్దు దాడిలో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని రేగుబల్లి గ్రామస్తుడైన వ్యవసాయ కూలీ కొర్సా వెంకటేష్(47), ఓ గిత్తను గోదావరి దాటించే పనికి ఒప్పుకున్నాడు. శనివారం ఉదయం ఆ గిత్తను గోదావరి దాటిస్తుండగా, అది ఒక్కసారిగా తిరగబడి కొర్సా వెంకటేష్‌ను కింద పడేసి కడుపుపై, గుండెపై గట్టిగా తన్నింది. అడ్డుకోబోయిన వారిపై కూడా దాడికి దిగి పరుగెత్తించింది. తీవ్ర గాయాలతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి సోదరుడి ఫిర్యాదుతో ఎస్సై గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాయాబజార్‌లో కార్డన్ అండ్ సెర్చ్

మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

రామవరం, జూన్ 1 : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రామవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాయాబజార్ ఏరియాలో శనివారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో 52మంది సబ్ డివిజన్ సిబ్బంది కలిసి తనిఖీ చేశారు. మొత్తం 40 మోటార్‌సైకిల్, ఐదు ఆటోలు, మద్యం స్వాధీనపర్చుకున్నారు. ఆ ప్రదేశంలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

BUSINESS OFFER

★ ఇన్సూరెన్స్ రంగంలో గొప్ప బిజినెస్ అవకాశం మీరు ఖమ్మం, కొత్తగూడెం వారా ? మీరు నిరుద్యోగులా / గృహిణి / రిటైర్డ్‌ఎంప్లాయ్ / వ్యాపార / రియల్‌ఎస్టేట్ / చిట్ / పోస్టల్ ఏజెంట్స్ / డాక్టర్ / చార్టెడ్ అకౌంటెంట్ / టాక్స్ కన్సల్టెంట్ / బ్యూటిషియన్ ఎవరైనా, ఎటువంటి పెట్టుబడి లేకుండా బిజినెస్ చేయాలని ఆసక్తికలిగి లీడర్ / ఏజెంట్ & పార్టనర్‌గా ఎదగాలని అనుకుంటే ఈ అవకాశం మీ కొరకే. సంప్ర : 7780662996

NTKMM-

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327724-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.